సాక్షి
తిరుపతి
సోమవారం, 14, అక్టోబర్, 2024



గజవాహనంపై సిరులతల్లి

తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారు శనివారం గజవాహనంపై భక్తులను అనుగ్రహించారు. - 8లో



టీడీపీ గూండాల స్వైరవిహారం

తిరుపతిలో టీడీపీ నేతలు న్యాయవాదులపై మారణాయుధాలతో దాడికి యత్నించి, వారి కార్యాలయాలను ధ్వంసం చేశారు. - 8లో



కనులపండువగా చక్రస్నానం

తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. సోమ, మంగళవారాల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుందని పేర్కొన్నారు. పీజీసెట్-2024లో అర్హత పొంది, ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరై అడ్మిషన్లు పొందాలని కోరారు. మరిన్ని వివరాలకు డీఓఏ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ బాబు 0877-2248589 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రీసెట్ అడ్మిషన్లు నేటి నుంచి ప్రారంభం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ, కుప్పం ద్రావిడ వర్సిటీ, ఎస్వీయూలో సోమవారం నుంచి ఏపీ రీసెట్ 2023-24 అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా వర్సిటీలలో సీట్లు పొందిన విద్యార్థులు సంబంధిత వర్సిటీ అడ్మిషన్ల కార్యాలయాల్లో సోమవారం నుంచి ఈనెల 19వ తేదీలోపు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.

ఫ్యామిలీ కోర్టును పరిశీలించిన హైకోర్టు జడ్జి



ఫ్యామిలీ కోర్టును పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుపతి లీగల్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిహారి శనివారం తిరుపతి ఫ్యామిలీ కోర్టు భవనం, కోర్టు హాలును పరిశీలించారు. తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జి రామ్‌గోపాల్‌ను కోర్టుకు రోజుకు ఎంతమంది న్యాయవాదులు, ప్రజలు వస్తున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ కోర్టుకు మానసిక వైద్యులను కేటాయించారని, వైద్యుడు ఉండడానికి ఓ భవనాన్ని కేటాయించాలని జడ్జి రామ్ గోపాల్ హైకోర్టు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు సూపరింటెండెంట్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. ఫలితాల కోసం ఎస్వీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

మంగపతి.. మంగళం.. జయ మంగళం







తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చక్రస్నానం సందర్భంగా శ్రీవారి పుష్కరిణిలో అశేష భక్తజనం (ఇన్‌సెట్) శ్రీ చక్రం, మలయప్పస్వామి

చక్రానికి పూజలు చేస్తున్న అర్చకులు

కష్టాలు కకావికలం కావాలని.. దుఃఖాలు దూది పింజల్లా కొట్టుకుపోవాలని.. బాధల బరువు దిగిపోవాలని కోనేటిలో తడిసి తరించడానికి తండోప తండాలుగా తరలివచ్చిన భక్తజనం.. సుదర్శన చక్ర స్పర్శతో పవిత్రమైన పుష్కరిణి జలం.. స్నానమాచరించి జనకోటి పునీతం. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం ఘట్టం వైభవంగా సాగింది. రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తం అయ్యాయి.

- ఘనంగా స్నపన తిరుమంజనం
- ఆగమోక్తంగా చక్రస్నానం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అంతకుముందు తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామివారికి పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 9 గంటల నడుమ శ్రీ భూవరాహస్వామి ఆలయం ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిపారు. తొలుత విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమయుక్తంగా స్నపనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్తులు, దశ శాంతి మంత్రాలు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం తదితర పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే వేదాలను టీటీడీ వేదపారాయణదారులు పారాయణం చేశారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను పెద్ద జీయంగార్, చిన్న జీయంగార్లు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.

ఘనంగా చక్రస్నానం

తొమ్మిది రోజుల ఉత్సవాల్లో జరిగిన అన్ని సేవలూ సఫలమై, లోకం క్షేమంగా ఉండడానికి, భక్తులు సుఖశాంతులతో ఉండడానికి చక్రస్నానం నిర్వహించారు. ఉత్సవాలు ఒక యజ్ఞం అయినందున యజ్ఞాంతంలో అవభథస్నానం చేస్తారు. యజ్ఞ నిర్వహణంలో జరిగిన చిన్నచిన్న లోపాలతో కలిగే దుష్పరిణామాలు తొలగి, అన్ని సంపూర్ణ ఫలాలు చేకూరడం కోసం చేసే దీక్షాంతస్నానం అవభథం. చక్రస్నానం (అవభథం)లో శ్రీవారి సుదర్శన చక్రానికి (చక్రత్తాళ్వార్‌కు) పుష్కరిణిలో స్నానం నిర్వహించే ముందు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో స్నానం చేయించారు. ఆ దివ్యాయుధ స్పర్శతో పవిత్రమైన పుష్కరిణి జలంలో భక్తసమూహం మునిగి పునీతులయ్యారు. ఈ ఉత్సవాలు చేసినవారికి, చేయించినవారికి, ఇందుకు సహకరించినవారికీ, దర్శించిన వారికీ అందరికీ ఈ ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుంది.

ఆగమోక్తంగా ధ్వజావరోహణం

చక్రస్నానం నాటి సాయంకాలం ధ్వజావరోహణం నిర్వహించారు. ఇంతటితో బ్రహ్మోత్సవయజ్ఞం ముగిసింది. ఎవరైతే బ్రహ్మోత్సవాల్లో పాలు పంచుకుంటారో వారు సమస్త పాపవిముక్తులై, ధన,ధాన్య సమృద్ధితో తులతూగుతారు. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ధ్వజావరోహణంతో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో టీటీ డీ ఈఓ శ్యామల రావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయంలో ధ్వజావరోహణం చేస్తున్న అర్చకులు



స్నపన తిరుమంజనంలో పాల్గొన్న టీటీడీ ఈఓ, అదనపు ఈఓ , జేఈఓలు

సామాన్య భక్తులకు పెద్దపీట



మాట్లాడుతున్న ఈఓ జే.శ్యామలరావు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేసినట్టు టీటీడీ ఈఓ జే.శ్యామలరావు తెలిపారు. భక్తులకు ఎలాటి అసౌకర్యం కలగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు సమన్వయంతో సేవలందించినట్టు కొనియాడారు. టీటీడీ సిబ్బంది సంయమనంతో, ప్రణాళికా బద్ధంగా, సీనియర్ అధికారుల పర్యవేక్షణలో సేవలందించారని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మొత్తం 15 లక్షల మంది భక్తులు శ్రీవారి వాహన సేవలు వీక్షించారన్నారు. గరుడ సేవ రోజున 82,043 మంది దర్శించుకున్నట్టు పేర్కొన్నారు. 30 లక్షల లడ్డూలు విక్రయించినట్టు తెలిపారు. హుండీ కానుకలు రూ.26 కోట్లు లభించినట్టు చెప్పారు.



వాహనం మోస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, ఎస్పీ సుబ్బరాయుడు

పల్లె నుదుట ప్రగతి సింధూరం

అవి నాడు కుగ్రామాలు.. ఊసేలేని ఉపాధి మార్గాలు.. అరకొర సేద్యమే ఆదాయ మార్గాలు.. అలాంటి మారుమూల పల్లెటూళ్లు.. మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముందుచూపుతో విరబూసిన ప్రగతి సింధూరాలు.. పెరిగిన వనరులు.. రాబడి మార్గాలు.. మారిన జీవన శైలి.. వెరసి ఆ గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం. ఇదీ ఎంతో వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గంలోని శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిధిలోని పల్లెల పరిస్థితి. ఆ గ్రామాల గురించి తెలుసుకుందాం.

- పట్టణాలవుతున్న పల్లెలు
- శ్రీసిటీ సెజ్‌తో మారిన జీవనశైలి



అభివృద్ధి చెందిన చెరివి దళితవాడ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): సత్యవేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన 14 గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీసిటీలో పలు పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. ఆ పారిశ్రామిక వాడ కోసం సేకరించిన భూములకు అధిక మొత్తంలో నష్టపరిహారం చెల్లించారు. పలువురికి ఉద్యోగాలు లభించాయి. ఫలితంగా వారి జీవితాలే మారిపోయాయి. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం సత్యవేడు మండలంలోని ఓ కుగ్రామం చెంగంబాక్కం. ఈ గ్రామంలో 60 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా దళితులు, 90 శాతం మంది పూరి గుడిసెలు, 10 కుటుంబాలు మినహా మిగిలిన వారు ఒక ఎకరా, రెండెకరాల రైతులు, కొందరు అది కూడా లేని వ్యవసాయ కూలీలు. ఏటా పండే ఒక పంటతోనే జీవనం. ఏడాది మొత్తం నిశ్చింతగా మూడు పూటలా తిండికి భరోసా లేదు. చాలీచాలని బతుకులు, రాకపోకలకు రెండు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి రోడ్డుపైకి చేరుకుని బస్సు ఎక్కాలి. గ్రామం మొత్తంలో ఓ మూడు, నాలుగు కుటుంబాల వారికే ద్విచక్రవాహనాలుండేవి. అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైతే మండల కేంద్రానికి, ఇతర పెద్ద ఆస్పత్రులకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడాల్సి వచ్చేది. పిల్లల చదువులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకే పరిమితం. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తల్లిదండ్రులు పిల్లల చదువులపై అంత శ్రద్ధ చూపేవారు కాదు. భర్తల సంపాదనపైనే కుటుంబం గడిచేది. భార్యలు, మహిళలు వంటింటికే పరిమితం. భర్తల ఆధిపత్యాన్ని భరించాలి. పలు కుటుంబాల్లో భర్తల సంపాదన తాగుడుకు ధారపోస్తూ కుటుంబ పోషణ గగనమయ్యేది. ఇదంతా పుష్కర కాలం ముందు మాట.

మహానేత ముందుచూపుతోనే అభివృద్ధి

ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉన్న సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధిలో ఎంతో వెనుకబడింది. నియోజకవర్గంలో బస్సుయాత్ర చేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్థానిక పరిస్థితులను అధ్యయనం చేశారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం అయిన వెంటనే 2008 ఆగస్టు 8వ తేదీన 7 వేల ఎకరాల్లో శ్రీసిటీ పారిశ్రామికవాడను ఏర్పాటు చేస్తూ తొలిసారిగా 8 పరిశ్రమలకు పునాదిరాయి వేశారు. ఆ పునాదిరాయి నేడు 200పై చిలుకు పరిశ్రమల శ్రీసిటీగా ఏర్పాటు అయ్యింది. 50 వేల మందికిపైగా నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామికవాడగా పేరు గాంచిన శ్రీసిటీకి భూములిచ్చిన 14 గ్రామాలు నేడు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయి.

నేటి పరిస్థితులివీ..

శ్రీసిటీ సెజ్‌తో నేడు వీరి జీవన స్థితి, శైలి పూర్తిగా మారింది. పూరి గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు వెలిశాయి. గ్రామాన్ని ఆనుకుని నాలుగులేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, క్రియా జాతీయ విశ్వవిద్యాలయం, చుట్టూ అంతర్జాతీయ పరిశ్రమలు, వివిధ రకాల దుకాణాలు, హోటళ్లు కనిపిస్తున్నాయి. వ్యవసాయం వీడారు. కార్మికశక్తిగా మారారు. 90 శాతం మంది 5 లోపు, అస్సలు చదువులేని వారైనప్పటికీ, భార్యాభర్తలిద్దరూ సమీప పరిశ్రమలు, యూనివర్సిటీలో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొందరు సొంత వ్యాపారాలు నడుపుతున్నారు. నాడు రెండు మూడు బైక్‌లకే పరిమితమైన గ్రామంలో నేడు ఇంటికి రెండు బైక్‌లు, ఐదారు కార్లు, పదికి పైగా ఏసీలు కలిగిన ఇళ్లు దర్శనమిస్తున్నాయి. పిల్లలను సమీపంలోని కార్పొరేట్ స్కూళ్లకు పంపుతున్నారు. భర్తల సంపాదన కొంత వారి వ్యసనాలకు ఖర్చయినా, భార్య సంపాదనే కుటుంబానికి ఆసరాగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ కుగ్రామం పట్టణమైంది. వారి గ్రామీణ జీవన స్థితి నేడు నగర జీవన శైలికి మారింది. ఇదే పరిస్థితి శ్రీసిటీలోని అన్ని గ్రామాల్లోనూ కనిపిస్తోంది. పుష్కలమైన ఉపాధి అవకాశాలతో పాటు గ్రామాల మధ్యలోనే కార్పొరేట్ స్కూళ్లు, హాస్పిటళ్లు, బ్యాంకులు, పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, తదితర వసతులు సమకూరాయి. అక్కడ పల్లెలన్నీ పట్టణీకరణ దిశగా పయనిస్తున్నాయి.

ఇంట్లో ఇద్దరికీ ఉద్యోగం



నేను, నా భర్త ఇద్దరూ ఐదోతరగతి లోపే చదువుకున్నాం. శ్రీసిటీ రాక ముందు కూలే మాకు జీవనాధారం. పూరిల్లు, కుటుంబ పోషణ అతి కష్టంగా సాగేది. మా ఊరు కుగ్రామం కావడంతో సరైన రోడ్లు, రవాణా, విద్య, వైద్య వసతులు లేదు. శ్రీసిటీ వచ్చిన తర్వాత మా జీవితం ఊహించని మలుపు తిరిగింది. నేను వందడుగుల దూరంలో ఉన్న క్రియా యూనివర్సిటీలో హౌస్ కీపింగ్ ఉద్యోగం, నా భర్త శ్రీసిటీలో సెక్యూరిటీగా పనిచేస్తూ ప్రస్తుతం ప్రతినెలా రూ.25 వేలు సంపాదిస్తున్నాం. మంచి ఇల్లు కట్టుకున్నాం. మా అబ్బాయి ఇంటర్ పూర్తి చేసి, ప్రస్తుతం సీఏ కోర్సు చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. నేడు మాకు ఎలాంటి దిగులు లేదు.

-మంజుల దంపతులు, చెంగంబాక్కం గ్రామం

పల్లెలో పట్టణ వసతులు



మాది శ్రీసిటీ పరిధి లోని మల్లవారిపాళెం వెస్ట్ గ్రామం, మాది రైతు కుటుంబం. నేను బీసీఏ చదివాను. సరైన ఉద్యోగం కోసం వెదుకులాటలో కొన్నాళ్లు చెన్నైలో, ఆపై దుబాయ్‌లో ఉద్యోగం చేశాను. మాది చిన్న పల్లెటూరు కావడంతో సరైన వసతులు లేవు. భవిష్యత్తులో ఉద్యోగంతో పాటు పిల్లల చదువుల కోసం ఎక్కడైనా నగరాల్లో స్థిరపడాల్సి వస్తుందని భావించాను. శ్రీసిటీ రాకతో అంతా మారిపోయింది. మా ఊరికి ఆనుకుని వంద మీటర్ల దూరంలో సిద్ధార్థ లాజిస్టిక్స్ అంతర్జాతీయ పరిశ్రమలో మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. డిగ్రీ పూర్తి చేసిన నా భార్యకు కూడా ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం వచ్చింది. మా పిల్లలను శ్రీసిటీలో కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తున్నాం. అమ్మ, నాన్న, ఇతర కుటుంబ సభ్యులతో కలసి హాయిగా ఉంటున్నాం.

-నవీన్ దంపతులు, మల్లవారిపాళెం వెస్ట్ గ్రామం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 24 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,684 మంది స్వామివారిని దర్శించుకోగా 36,482 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

తిరుపతికి వర్షసూచన



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ, జేసీ, డీఆర్వోలు

- ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి
- 14 నుంచి 17 వరకు భారీ వర్షాలు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ - 0877 2236007

తిరుపతి అర్బన్: తిరుపతికి వర్ష సూచన ఉందని, సోమవారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ కేంద్రం సూచించిందని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన ఆదివారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. నైరుతి బంగాళాఖాతంలో సోమవారానికి అల్పపీడనం ఏర్పడనుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో జిల్లాలోని సముద్రతీర ప్రాంతానికి చెందిన మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని స్పష్టం చేశారు. సెలవుల్లో ఉన్న అధికారులు సైతం డ్యూటీలో చేరాలని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 0877 2236007 ఏర్పాటు చేశామన్నారు. అలాగే మండల, డివిజన్ స్థాయిలోను అధికారులు కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముందే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని పలు జలపాతాల పర్యాటక ప్రాంతాలైన కైలాసకోన, అరె, తలకోన, వాటర్ ఫాల్స్, సముద్ర బీచ్ ప్రాంతాలను పర్యాటకులు సందర్శించడానికి వీలులేదని చెప్పారు. సముద్రతీరం ఉన్న గ్రామాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గతంలో వర్షాల నేపథ్యంలో తిరుపతి నగరం నీటి మునకను దృష్టిలో ఉంచుకుని పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గజవాహనంపై సిరులతల్లి

చంద్రగిరి(తిరుచానూరు): విజయదశమి సందర్భంగా తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారు శనివారం గజవాహనంపై భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ చేసి, శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ దీప కాంతుల నడుమ అమ్మవారికి ఊంజల్‌సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని గజవాహనంపై కొలువుదీర్చి నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు.

ప్రపంచ శాంతికి మతపెద్దల ప్రార్థనలు


ఇస్తిమాలో నమాజు చేస్తున్న ముస్లింలు

నాయుడుపేటటౌన్: ప్రపంచ శాంతి కోరుతూ నాయుడుపేటలోని జామీయా మసీదు ఈద్గా మైదానంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ముస్లిం మతపెద్దలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దల సారథ్యంలో శని,ఆదివారాల్లో ఇస్తిమా నిర్వహించి మత పెద్దలు ప్రబోధనలు చేశారు. ప్రతి ఒక్కరు మంచిగా నడుచుకోవాలని, తల్లి దండ్రులతోపాటు పెద్దలను గౌరవించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతిరోజూ ఐదు పూటల నమాజు చేయాలన్నారు. సంపాదించిన నగదులో కొంత పేదలకు పంచిపెట్టి ఇతరులకు సహాయం చేయాలని, చెడు వ్యసనాల జోలికి వెళ్లకూడదని సూచించారు. జామీయా మసీదు ముతవల్లి హజీ రహతాల్లా సాహెబ్, మసీదు కమిటీ సభ్యులు అమీర్‌షావలి తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్.. లక్కు ఎవరిదో?

పచ్చనేతల బెదిరింపులు.. దౌర్జన్యాలు.. దరఖాస్తు చేస్తే చంపేస్తామన్న హెచ్చరికలు.. తెలుగుతమ్ముళ్లకు అధికారుల అండదండలు.. అయినా వెరవని వ్యాపారులు.. వేలల్లో వచ్చిన దరఖాస్తులు.. సీన్ కట్ చేస్తే.. మద్యం దుకాణాలు ఎవరి సొంతం కానున్నాయో... ఎవరి అదృష్టం ఎలా ఉందో అన్న విషయం సోమవారం తేలనుంది. లిక్కర్ లక్కు కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

- నేడు మద్యం దుకాణాలకు లాటరీ
- ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం
- తిరుచానూరు శిల్పారామంలో ఏర్పాట్లు
- కలెక్టర్ నేతృత్వంలో మద్యం దుకాణాల ఎంపిక
- 227 దుకాణాలకు 3,920 దరఖాస్తులు



తిరుపతి క్రైం : జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 227 మద్యం దుకాణాలకు 3,920 మంది వ్యాపారులు దరఖాస్తులు చేసుకున్నారు. కొన్నిచోట్ల స్థానిక అధికారపార్టీకి చెందిన నేతలు ఒక్కొక్క దుకాణానికి ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వేయాలని, లేదంటే మద్యం దుకాణం దక్కించుకున్నా అడ్డుకుంటామని హెచ్చరించినప్పటికీ కొందరు వ్యాపారులు మాత్రం లెక్క చేయకుండా దరఖాస్తులు నమోదు చేశారు. ఆ మేరకు రెండు రోజుల క్రితం దరఖాస్తులకు గడువు ముగిసిన సంగతి తెలిసిందే. కాగా తిరుచానూరు శిల్పారామంలో సోమవారం ఉదయం 6.30 గంటల నుంచి మద్యం దుకాణాల ఎంపిక కోసం లాటరీ పద్ధతిలో ప్రక్రియ మొదలు పెట్టనున్నారు. అయితే తొలి దుకాణం ఫలితం ఉదయం 8 గంటలకు తేలనుందని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ఒక్కొక్క దుకాణం లాటరీ పద్ధతిలో వరుసగా ప్రకటించనున్నారు. మొత్తంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటల లోపు ప్రక్రియ పూర్తి చేయనున్నారు. అనంతరం మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారులు బుధవారం నుంచి కొత్తగా మద్యం దుకాణాలు నిర్వహించుకోవడానికి వీలుగా ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

డిపాజిట్ రూ.78.40 కోట్లు గోవిందే

జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 227 దుకాణాలకు 3,920 దరఖాస్తులు వచ్చాయి. అయితే 227 మందికి మాత్రమే దుకాణాలు రానున్నాయి. మిగిలిన 3,693 మంది తిరిగి ఇంటికి వెళ్లాల్సిందే. ఈ క్రమంలో ఒక్కొక్కరు రూ.2 లక్షలు చొప్పున 3,690 మంది చెల్లించి రూ.78.40 కోట్లు గోవిందే. ఆ నగదు ప్రభుత్వానికే చెందుతుంది.

దరఖాస్తు ద్వారా రూ.780 కోట్ల ఆదాయం

227 మద్యం షాపులకు గాను 3,920 దరఖాస్తులు రావడంతో ప్రభుత్వానికి రూ.780 కోట్ల ఆదాయం లభించింది. అంతేకాకుండా 64 మద్యం దుకాణాలకు ఒక్కొక్క షాపునకు రూ.55 లక్షల ఆదాయం లైసెన్స్ ఫీజుల రూపంలో రానుంది. 163 మద్యం దుకాణాలకు ఒక్కొక్క షాపునకు రూ.65 లక్షల రాబడి రానుంది. కాగా తిరుపతిలో 32 దుకాణాలకు అత్యధికంగా 985 దరఖాస్తులు రాగా ఎర్రావారిపాళెంలో అతి స్వల్పంగా కేవలం 21 దరఖాస్తులు అందాయి. కొత్త మద్యం పాలసీ మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలు జరపనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

చంద్రగిరి: మద్యం దుకాణాల ఎంపికకు లాటరీ పద్ధతిలో నిర్వహించనున్న ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు దాదాపు పూర్తి చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో రెండు కౌంటర్లను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఒకటో నంబర్ హాలులో తిరుపతి డివిజన్‌కి సంబంధించిన తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించిన మద్యం దుకాణాల లాటరీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో నంబర్ హాలులో గూడూరు డివిజన్‌కి సంబంధించిన గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వాకాడు, వెంకటగిరి ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించిన మద్యం దుకాణాల లాటరీ నిర్వహించనున్నారు. తొలుత గూడూరు ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించిన మద్యం దుకాణాల లాటరీ ప్రారంభిస్తారు. దరఖాస్తుదారులు వారికి కేటాయించిన ఎంట్రీ పాసులతో పాటు ఐడెంటిటీ ప్రూఫ్, అభ్యర్థుల తరఫున హాజరయ్యే వ్యక్తులు ఐడెంటిటీ ప్రూఫ్, అభ్యర్థి ఎంట్రీ పాసుతో హాజరు కావాలని కోరారు. లాటరీ ద్వారా మద్యం దుకాణాలు పొందిన వ్యక్తులు వారు చెల్లించాల్సిన మొదటి కంతును శిల్పారామంలో ఏర్పాటు చేసిన బ్యాంక్ కౌంటర్లలో చెల్లించాలని ఆ ప్రకటనలో కోరారు.

మద్యం దుకాణాల లాటరీకి తుపాన్ లేదా..?

నాలుగు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షాలు ఉన్నాయని అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా అంతటా అలర్ట్ ప్రకటించారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో మద్యం దుకాణాల లాటరీ వాయిదా పడుతుందని అంతా భావించినప్పటికీ..అధికారులు మాత్రం యథావిధిగా సోమవారం ఉదయం తిరుచానూరు శిల్పారామంలో మద్యం దుకాణాల ఎంపికకు లాటరీ కొనసాగుతుందని స్పష్టం చేయడం గమనార్హం.

వాహనం పెట్టాం..బయల్దేరి రండి

తూర్పు నియోజకవర్గానికి చెందిన ఓ ఎమ్మెల్యే మద్యం టెండరుదారులను నయానో భయానో వలలో వేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారి కోసం ప్రత్యేకంగా వాహనం పెట్టామని, సోమ వారం ఉదయం 5 గంటలకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి తమ వాహనం బయల్దేరుతుందని, అందరూ తప్పకుండా తిరుపతి శిల్పారామంలో జరిగే లక్కీడిప్‌కు హాజరు కావాలని ఆదేశించారు.

కనులపండువగా చక్రస్నానం


స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు
- సారె తీసుకుని వచ్చిన తుమ్మలగుంట గ్రామస్తులు
- కృతజ్ఞతలు తెలిపిన ధర్మకర్త చెవిరెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం 6.00 నుంచి 9 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు తిరుమంజనసేవ నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. చక్రతాళ్వార్ పుష్కరిణి జలంలో మునిగినప్పుడు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులతోపాటు తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. గత 9 రోజుల పాటు నిర్విఘ్నంగా సాగిన స్వామి వారి బ్రహ్మోత్సవాలు విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి, ప్రత్యేకంగా మీడియా ప్రతినిధులకు చెవిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తి

శనివారం రాత్రి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం 7.30 నుంచి 9.00 గంటల వరకు ధ్వజావరోహణం వైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. ధ్వజావరోహణంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అయ్యాయి. కాగా బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ప్రతి పంచాయతీ నుంచి సారె తీసుకుని వచ్చి భక్తితో సమర్పించారు. ఉత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం రోజున తుమ్మలగుంట వాసులు సారె తీసుకుని రాగా చెవిరెడ్డి ఎదురేగి స్వాగతం పలికారు.

న్యాయవాదులపై టీడీపీ గూండాల స్వైరవిహారం



తిరుపతి నగర టీడీపీ అధ్యక్షుడు చినబాబు, కార్యకర్తలు కూల్చిన ప్రహరీ గోడ, గేట్లు

- మారణాయుధాలతో దాడికి యత్నం
- ధ్వంసమైన న్యాయవాదుల కార్యాలయాలు

తిరుపతి లీగల్: నగరంలో టీడీపీ నాయకులు మరోసారి రెచ్చిపోయారు. న్యాయవాదులపై మారణాయుధాలతో దాడికి యత్నించి, వారి కార్యాలయాలను ధ్వంసం చేసిన ఘటన శనివారం తిరుపతిలో చోటుచేసుకుంది. సీనియర్ న్యాయవాదులు ముక్కు సత్యవంతుడు, మునిభాస్కర్, రమేష్‌రెడ్డి, మధుసూదనరావు, మరికొందరు న్యాయవాదుల కథనం మేరకు.. మిట్టపాళేనికి చెందిన ప్రవీణ్ అనే వ్యక్తికి తిరుపతి ప్రకాశం రోడ్డులో మూడంతస్తుల భవనం ఉంది. ఆ భవనంలో సీనియర్ న్యాయవాది ముక్కు సత్యవంతుడు 30 ఏళ్లకుపైగా ఓ గదిని అద్దెకు తీసుకుని కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు సీనియర్ న్యాయవాదులు గుర్రప్పనాయుడు, మధుసూదనరావు, రమేష్‌రెడ్డి, మునిభాస్కర్ తదితరులు వేర్వేరు గదులను అద్దెకు తీసుకుని కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. కాగా.. తిరుపతి నగర టీడీపీ అధ్యక్షుడు శంకర నారాయణ (చినబాబు) శనివారం 20 మందికి పైగా టీడీపీ కార్యకర్తలు, గూండాలతో న్యాయవాదుల కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. ఆ భవనం ముందున్న ప్రహరీ గోడను తొలగించి, న్యాయవాదులు అద్దెకు తీసుకున్న గదులను వెంటనే ఖాళీ చేయాలంటూ మారణాయుధాలతో దాడికి యత్నించారు. భయభ్రాంతాలకు గురైన న్యాయవాదులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సీఐ రామకృష్ణ, సిబ్బంది అక్కడికి చేరుకుని టీడీపీ నేత చినబాబు, కార్యకర్తలను తరిమేశారు. న్యాయవాదులైతే తమకేంటని టీడీపీ నేత చినబాబు గూండాలతో తమ కార్యాలయంపై దాడి చేశారని సీనియర్ న్యాయవాది ముక్కు సత్యవంతుడు వాపోయారు. తమ కార్యాలయాలను ఇప్పటికప్పుడు ఖాళీ చేయమంటే ఇబ్బంది అని, కొంత సమయం ఇస్తే ఖాళీ చేస్తామంటూ గతంలోనే భవన యజమానికి చెప్పామని తెలిపారు. చినబాబు తమపై మారణాయుధాలతో దాడి చేయించాల్సిన అవసరం ఎందుకొచ్చిందో తమకు అర్థం కావడం లేదని వాపోయారు. గతంలో రైల్వే స్టేషన్ సమీపంలో కూడా భవనాలను ఇలాగే దౌర్జన్యంగా ఖాళీ చేయించినట్లు చెప్పారు.

చినబాబును టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలి

తిరుపతిలో న్యాయవాదులపై దౌర్జన్యం చేసిన శంకర్ నారాయణ అలియాస్ చిన్న బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సీనియర్ న్యాయవాది, జనసేన పార్టీ రాయలసీమ కన్వీనర్ ముక్కు సత్తివంతుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి ప్రశాంత నగరమని, ఇక్కడ రౌడీయిజం చెల్లదని పేర్కొన్నారు. ఈ దౌర్జన్యాన్ని జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఇదిలావుండగా ఆదివారం జనసేన నాయకులు కిరణ్‌రాయల్, కార్యకర్తలు సీనియర్ న్యాయవాది ముక్కు సత్తివంతుడు కార్యాలయాన్ని ఇతర న్యాయవాదుల కార్యాలయాలను పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై దౌర్జన్యం


దాడికి యత్నిస్తున్న ముత్యాల పార్థసారథి, అతని అనుచరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడిపై తెలుగుతమ్ముళ్లు దౌర్జన్యం చేశారు. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. వివరాల్లోకెళితే.. దేవాంగుల ఇలవేల్పుగా కొలిచే చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు పులి రామచంద్ర కుటుంబ సభ్యులతో వచ్చారు. అదే సమయంలో తన అనుచరులతో అక్కడికి చేరుకున్న మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు ముత్యాల సారథి, పులి రామచంద్ర కుటుంబ సభ్యులను దుర్భాషలాడగా, రామచంద్ర సోదరులు నాగార్జునపై దాడి చేసి, కొట్టారు. ఈ విషయమై పులి రామచంద్ర, ముత్యాల సారథి మధ్య తోపులాట జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకునేందుకు యత్నించగా స్థానికంగా ఉండే భక్తులు వారిని సర్దుబాటు చేశారు. ఈ విషయం పులి రామచంద్ర మాట్లాడుతూ ముత్యాల పార్థసారథి, అతని సోదరుడు కృష్ణ, అతని బంధువులు మచ్చ విజయ్, పట్టెం జగదీష్ మద్యం సేవించి, వచ్చి తమపై దాడి చేశారన్నారు. తమ కులదైవాన్ని దర్శించుకోవడానికి వస్తే తమ కుటుంబ సభ్యులను దుర్భాషలాడి తన అన్న పులి నాగార్జునపై దాడి చేసి, కొట్టారన్నారు. తన అన్నను ప్రభుత్వాస్పత్రిలో చేర్చి చికిత్స అందించామన్నారు. అయితే పోలీసులు టీడీపీ నాయకుడైన ముత్యాల సారథిపై కేసు నమోదు చేయకుండా అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఆలస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేసు నమోదు చేసి ముత్యాలు సారథిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులను దీనిపై వివరణ కోరగా విచారిస్తున్నామని, కేసు నమోదు చేస్తామన్నారు.

పెళ్లికి వెళ్లి తిరిగి వస్తూ కానరాని లోకాలకు..

–కారు, ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి –ఐదుగురికి తీవ్ర గాయాలు


శాంతమ్మ మృతదేహం

నాయుడుపేటటౌన్: పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్నా ఓ కారు, ఆటోను ఢీకొంది. ఈ సంఘటన మండలంలోని నరసారెడ్డి కండ్రిగ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరసూరి శాంతమ్మ(68) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన కొంతమంది సూళ్లూరుపేటలో ఆదివారం జరిగిన వివాహానికి హాజరై, తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. మార్గం మధ్యలో నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి కూడలి దాటి తరువాత వెనుక నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న ఆరసూరి శాంతమ్మతోపాటు నిత్యం గోపాల్, సిద్ధవరం కృష్ణకుమారి, అరసూరి శారదమ్మ, సిద్ధవరం జనార్దన్, ఆటో డ్రైవర్ శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు శాంతమ్మ మృతి చెందింది. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబి వెల్లడించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం


యువకుడిని కరెంటు స్తంభానికి కట్టేసిన స్థానికులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని సంత మైదానం వద్ద ఐదేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన గుర్తుతెలియని యువకుడికి దేహశుద్ధి చేసిన ఘటన శనివారం వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు.. సంత మైదానం ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలికను గుర్తుతెలియని యువకుడు స్కూటర్‌పై తీసుకొచ్చి నిర్మాణంలో ఉన్న ఇంటి మిద్దెపైకి బలవంతంగా ఎత్తుకెళ్లాడు. అటుగా వెళుతున్న సుబ్బలక్ష్మి అనే యువతి అతని వాలకంపై అనుమానంతో గమనించింది. ఆపై విషయాన్ని స్థానికులకు చెప్పింది. దీంతో స్థానికులు మిద్దెపైకి వెళ్లి బాలికపై అఘాయిత్యం చేయబోతున్న యువకుడిని పట్టుకుని కరెంట్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. ఆపై ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నిందితునికి రిమాండ్

శ్రీకాళహస్తి గాంధీవీధిలో ఆరేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఇటీవల ఆరేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముద్దాయి అయిన తొట్టంబేడు మండలం జ్ఞానాంబకండ్రిగకు చెందిన రామయ్య కుమారుడు అంజూరు మునికన్నాను కోర్టులో హాజరు పరచగా 15రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు సీఐ గోపి తెలిపారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి యు.చెన్నయ్య శనివారం ఓక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు జన్మభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీలు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు.

మూడో సారి దరఖాస్తుల ఆహ్వానం

ఆగస్టులో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్ నేతృత్వంలో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇస్తున్నామని దరఖాస్తులు చేసుకోవాలని ఓ ప్రకటన విడుదల చేశారు. ఆమేరకు పెద్ద సంఖ్యలో పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఆ దరఖాస్తులు ఏమైనాయో....శిక్షణ మాత్రం ఒక్కరికి ఇవ్వలేదు.

ఆ తర్వాత సెప్టెంబర్‌లో ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి సూర్యనారాయణ నేతృత్వంలో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇస్తున్నామని దరఖాస్తులు చేసుకోవాలని ఓ ప్రకటన విడుదల చేశారు. పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత ఉచిత శిక్షణ ఊసేలేదు.

తాజాగా అక్టోబర్‌లో డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇస్తామని దరఖాస్తులు చేసుకోవాలంటూ ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి యు. చెన్నయ్య నేతృత్వంలో ఓ ప్రకటన విడుదల చేశారు. నెలకొకసారి డీఎస్సీకి ఉచిత శిక్షణ ఇస్తామంటూ ఒక్కో అధికారితో ప్రకటనలు ఇప్పించడంపై డీఎస్సీ విద్యార్థులు తీవ్రంగా మండిపడుతున్నారు.

ప్రాణం తీసిన అంబులెన్స్

– 108 వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తిరుపతి రూరల్: ప్రాణాలు కాపాడాల్సిన అంబులెన్స్ వ్యక్తి ప్రాణాలు తీసిన ఘటన తిరుపతి రూరల్ మండలం పేరూరు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి (62) ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఇటీవల ఉద్యోగవిరమణ చేశాడు. సోమవారం పాతకాల వద్ద కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్దకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని వకుళమాత గుడి సమీపంలో రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి తిరుపతికి రోగిని తీసుకువెళుతున్న 108 వాహనం వేగంగా వచ్చి సుబ్రమణ్యం రెడ్డి నడుపుతున్న బైక్ను ఢీ కొంది. ఈఘటనలో సుబ్రహ్మణ్యంరెడ్డికి తలకి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ పై ఉన్న మరో వ్యక్తి సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ ఎస్కే మూర్తి తెలిపారు.

మా భూమిని కబ్జా నుంచి కాపాడండి

- బాధితుడు బాలకృష్ణ వేడుకోలు


కబ్జాకు గురైన తమ స్థలం ఫొటోలను చూపుతున్న బాధితుడు బాలకృష్ణ

తిరుపతి కల్చరల్: తమ భూమిని తిరుపతికి చెందిన టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ దౌర్జన్యంగా కబ్జా చేస్తున్నాడని, పోలీసులు ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తన భూమిని కబ్జా కోరల నుంచి కాపాడాలని నగరానికి చెందిన బాధితుడు బాలకృష్ణ వేడుకున్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన భూకబ్జా వివరాలను తన భార్య సరస్వతి, కుమార్తె నవ్యతో కలిసి మీడియాకు వివరించారు. తిరుచానూరు లెక్కదాఖలా సర్వే నంబర్ 249/4,249/5లోని ఎకరా 36 సెంట్లు భూమిని 1997లో పిల్లపాళెం పి.పొట్టయ్య, మరి కొందరి నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నానని చెప్పారు. తమ స్వాధీన అనుభవంలో ఉన్న ఈ స్థలాన్ని 15 రోజులుగా తమ స్థలం పక్కనే ఉన్న టీటీడీ నేత జేబీ శ్రీనివాస్ సుమారు 50 మందిని తమ స్థలంలోకి పంపి శుభ్రం చేయించారన్నారు. దీనిని ప్రశ్నించిన తమపై దౌర్జన్యం, దాడి చేయడంతోపాటు స్థలం వద్దకు వస్తే చంపేస్తామని బెదిరించారని వాపోయారు. తాము భయంతో 100కు ఫోన్ చేశామని తెలిపారు. స్థలం వద్దకు వచ్చిన పోలీసులు దౌర్జన్యకారులను చూసి వెళ్లిపోయారని తెలిపారు. తనకు ఎమ్మెల్యే అండ ఉందని, తనని ఎవరూ ఏమి చేయలేరని, మీకు దిక్కున్న చోట చెప్పుకో.. వస్తే అంతు చేస్తామని బెదిరించారని కన్నీటి పర్యంతమయ్యారు. జేబీ శ్రీనివాస్ నుంచి తమకు ప్రాణ హాని ఉందని, తాను కూడా తెలుగు దేశం పార్టీలో సామాన్య కార్యకర్తనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పెద్దలు తమ భూమి కబ్జా సంఘటనపై జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో హోటల్ మేనేజర్ దుర్మరణం


హోటల్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

చిల్లకూరు: విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న హోటల్ మేనేజర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రైటార్ సత్రం సమీపంలో ఉన్న అమరావతి హోటల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న పార్లపల్లి మధుసూదన్‌రెడ్డి(55) దసరా పండుగ రోజున హోటల్‌లో పనులు ముగించుకుని గూడూరు వైపు ద్విచక్రవాహనంలో ఇంటికి బయలు దేరాడు. హోటల్‌కు కూత వేటు దూరంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీ కొంది. దీంతో అతడు రోడ్డుపక్కనే ఉన్న పొదల్లో పడిపోయాడు. అయితే బైక్ మాత్రం రోడ్డుపై పడింది. హైవే మొబైల్ పోలీసులు బైక్ రోడ్డుపై పడి ఉండడాన్ని గుర్తించి, వెళ్లి పరిశీలించి, ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. దీంతో రోడ్డు పక్కన ఉన్న పొదలో గమనించగా మధుసూదన్‌రెడ్డి తీవ్ర గాయాలుతో పడి ఉన్నాడు. వెంటనే వారు హోటల్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చి అతనిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.